సాక్షి
నంద్యాల
గురువారం ౹ 9 ౹ నవంబర్ ౹ 2023





## సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం. ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



## పుడమికి పుత్తడి వర్ణం

గడివేముల: వరిపైరు కోతకు వచ్చి పసిడి రంగులో కనిపిస్తోంది. పెసరవాయి గ్రామ సమీపంలో భానుడి కిరణాలతో పుడమి పుత్తడి వర్ణం అద్దుకుని కనువిందు చేసింది.



## ఆధ్యాత్మిక శోభితం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 32 నూతన దేవాలయాలు నిర్మిస్తున్నారు. ఇందు కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.3.20 కోట్ల నిధులను విడుదల చేసింది. IIలో▸

# కార్మికులకు ఆరోగ్య భద్రత

- ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్స్ పెంపుతో పెరిగిన జీతం
- గతానికి భిన్నంగా ఒకటో తారీఖునే జీతం జమ
- రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 699 మందికి పైగా లబ్ధి
- ఆనందంలో మున్సిపల్ కార్మికులు



బొమ్మలసత్రంలో రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికురాలు

**నాడు:** మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుల జీవితాలు చాలా దయనీయంగా ఉండేవి. జీతాలు ఎప్పుడు పడతాయో తెలియదు. జీతం పెంచమని అడిగితే ఇక ఉద్యోగం ఉంటుందో పోతుందో తెలియని దుస్థితి. కార్మికులకు సమయపాలన లేకుండా విధులు నిర్వహిస్తూ సిబ్బంది కొరత ఉన్నా వారితోనే సర్దుబాటు చేసుకునేవారు. జీఓ 279 ద్వారా ప్రైవేటు వ్యక్తుల కబంద హస్తాల్లో కార్మికుల జీవితాలు ఉండేవి.

**నేడు:** గతానికి భిన్నంగా పారిశుధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారికి ఉద్యోగ భద్రతను కల్పిస్తూ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జీఓ 279ను రద్దు చేసి ఆప్కాస్(ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్‌డ్ సర్వీసెస్) ను రూపొందించి వారి జీవితాల్లో మార్పులు తెచ్చింది. గత ప్రభుత్వం విస్మరించిన ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను(ఓహెచ్ఏ) పునరాగమనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు సుమారు రూ.6 వేలను అధికంగా కార్మికులకు అందిస్తోంది. గతంలో మాదిరిగా గాకుండా ఒకటవ తేదీనే జీతాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపింది. కార్మికుల ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు తీసుకున్న జగన్ ప్రభుత్వంపై కార్మికులు నేడు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నంద్యాల పట్టణంలో కాల్వ పూడిక తొలగిస్తున్న కార్మికులు

**పబ్లిక్ హెల్త్ విభాగంలో (అవుట్‌సోర్స్‌లో) కార్మికులుగా విధుల నిర్వర్తిస్తున్న వారి వివరాలు..**

| మున్సిపాలిటీ | కార్మికులు |
|---|---|
| నంద్యాల | 325 |
| ఆత్మకూరు | 69 |
| ఆళ్లగడ్డ | 91 |
| నందికొట్కూరు | 63 |
| డోన్ | 73 |
| బేతంచెర్ల | 78 |
| మొత్తం | 699 |

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఓహెచ్ఏ(ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు)కు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఫలితంగా మున్సిపల్ కార్మికుల రూ.15 వేల వేతనానికి అదనంగా రూ.6 వేలు ఓహెచ్ఏను చెల్లించనుంది. దీంతో పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.21 వేలకు పెరిగింది. ఈ ఉత్తర్వులతో నంద్యాల జిల్లాలో సుమారు 600 మందికి పైగా కార్మికులకు మేలు జరగనుంది. జీఓ నెం.233 ద్వారా ఇస్తున్న ఆరోగ్య భృతిని యథాతథంగా అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**పారిశుధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు..**

మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. గతంలో కార్మికులు రూ.12 వేల వేతనంతో జీవితం వెల్లదీసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రూ.15 వేలకు పెంచి వారికి ఊరట కలిగించింది. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న పారిశుధ్య కార్మికుల జీఓ 279ను రద్దు చేసి ఆప్కాస్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించింది. అంతే కాకుండా ప్రభుత్వం కార్మికులు జీవితాల క్షేమం కోసం ఆలోచిస్తూ వారికి హెల్త్ అలవెన్స్‌ను పెంచి మంచి చేసింది. గతంలో రూ.15 వేల చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్న వారికి ఊరట కల్పిస్తూ చేయూతనిచ్చింది.

### ప్రతి నెలా జీతాలందుతున్నాయి



నేను 2016 నుంచి నంద్యాల మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్నాను. గతంలో జీతాలు సక్రమంగా వచ్చేవి కావు. మూడు నాలుగు నెలలకోసారి వచ్చేవి. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు అందుతున్నాయి. జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ కింద రూ.6 వేలు అందుతోంది. ప్రభుత్వం మా ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం సంతోషంగా ఉంది.

– బండారు వెంకటేశ్వర్లు, పారిశుధ్య కార్మికుడు, నంద్యాల

### ఉద్యోగ భద్రత కల్పించారు



ప్రజలకు సేవలు అందిస్తున్న మమ్మల్ని జగనన్న ప్రభుత్వం గుర్తించి ఆప్కాస్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించింది. గతంలో ఉద్యోగాలు ఉంటాయో పోతాయో తెలియని పరిస్థితి ఉండేది. నేడు మా సేవలకు ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తూ జీతానికి అదనంగా రూ.6వేల ఇవ్వడం సంతోషకరం.

– మరియమ్మ, గరీబ్‌నగర్, ఆత్మకూరు

### కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఇరవై ఐదేళ్లుగా శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఇంటి అద్దెకు, ఇంటి ఖర్చులకే జీతం సరిపోయేది. ఆరోగ్య పరంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు అప్పు చేయాల్సి వచ్చేది. మా ఆరోగ్య పరిరక్షణ కోసం అదనంగా రూ.6వేలు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయం.

– నాగమ్మ, బొమ్మలసత్రం, నంద్యాల

## న్యూస్‌రీల్

### పంచ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

నంద్యాల టౌన్: కార్తీక మాసం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన ఓంకారం, మహానంది, భోగేశ్వరం, యాగంటి, కాల్వబుగ్గలకు కార్తీక మాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలానికి ప్రతి ఆది, సోమవారాలలో జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఈనెల 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నామని ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### రేపు మిడుతూరులో 'జగనన్నకు చెబుదాం'

మిడుతూరు: స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణంలో ఈ నెల 10న జగనన్నకు చెబుదాం( స్పందన కార్యక్రమం) ఉంటుందని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనతోపాటు అన్ని శాఖల జిల్లా అధికారుల హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించి పరిష్కారాలు పొందాలన్నారు.

### రక్తపింజరి కలకలం



పామును పట్టుకుంటున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరు: పట్టణ శివారులో బుధవారం రక్తపింజరి పాము కలకలం సృష్టించింది. ఇండియన్ పెట్రోల్‌బంక్ వద్ద రక్తపింజరిని చూసిన నిర్వాహకులు ఆందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి పామును వలలో బంధించారు. రక్తపింజరిగా గుర్తించి నల్లమల అభయారణ్యంలోకి తీసుకెళ్లి సురక్షితంగా వదిలివేశారు.

### రేపు జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పణాధికారి దీప్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్ షిప్ ఆఫీసర్, ఎంఎస్ మోటార్స్, యూనిమోని ఫైనాన్సియల్ సర్వీస్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అవకాశాన్ని నంద్యాల జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 20–30 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తగిన ధృవపత్రాలతో పాటు ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలను గిగిగ్రిూఇ. ఎగ్లైఫ్లూ లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

### సోమస్కందమూర్తి విగ్రహాల బహూకరణ



సోమస్కందమూర్తి విగ్రహాలను అధికారులకు అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానానికి ప్రచార రథానికి అవసరమైన సోమస్కందమూర్తి ఉత్సవ విగ్రహాలను బుధవారం వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ దంపతులు బహూకరించారు. ఉత్సవ విగ్రహాలకు అర్చక వేదపండితులు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు దేవస్థానం తరపున స్వామివార్ల శేషవస్త్రాలు,లడ్డూప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### 'నాడు-నేడు' స్కూళ్లకు నిర్వహణ నిధులు

కర్నూలు సిటీ: నాడు- నేడు కింద అభివృద్ధి చెందిన 594 పాఠశాలలకు రూ.30.47 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులను స్కూల్ పేరెంట్స్ కమిటీ ఖాతాల్లో జమ చేశారు. నిధుల వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నాడు–నేడు కింద చేపట్టిన పనులకు కాకుండా ఇతర అవసరాల కోసం వీటిని ఖర్చు చేయకూడదు. మౌలిక సదుపాయాల్లో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసి వారంటీ ఉండే వాటికి కాకుండా వారంటీ లేని మరమ్మతులకు ఈ నిధులను వినియోగించనున్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

డోన్ టౌన్: వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ వినియోగదారుల సంస్థ పరిష్కార వేదిక చైర్మన్, రిటైర్డు జిల్లా జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను నిర్ణీత సమయంలో సంస్థ పరిష్కరిస్తుందన్నారు. పరిష్కారం లభించకపోతే తమ సంస్థకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ కమిటీ ఫైనాన్స్ సభ్యులు రామమోహన్‌రావు, టెక్నికల్ సభ్యులు ఎస్.ఎల్ అంజనికుమార్, కన్జూమర్ అఫైర్స్ సభ్యులు గాయం ఈశ్వరమ్మ, డీఈఈలు రమణ, మద్దిలేటి, మధుసూదనరెడ్డి, ఏఈలు నాగేశ్వరరెడ్డి, రమాదేవి, మద్దిలేటి, శ్రీనివాసులు, గజ్జెప్ప, రాఘవేంద్రప్రసాద్, మహబూబ్‌వలి, ఏఏఓ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్న సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయం,గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధి కారులు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యు లు,ఎంపీపీలు హాజరుకావాలని సీఈఓ కోరారు.

## ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే శిల్పా రవి

- నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' ద్వారా ప్రజల్లోకి వెళ్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

నంద్యాల: ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా గురువారం నుంచి ప్రజల్లోకి వెళ్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరిస్తారన్నారు. ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాద యాత్ర చేపట్టి అన్ని వర్గాల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నవరత్నాల పేరుతో పథకాలు రూపొందించి వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వచ్చారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో దాదాపు 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కోవిడ్ కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలను కొనసాగించామన్నారు. 2014లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా వంచించిన విధానాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. చంద్రబాబు నాయుడి హయాంలో 34,408 ఉద్యోగాలను మాత్రమే కల్పించగా జగనన్న 4.93 లక్షల ఉద్యోగాలిచ్చారన్నారు. ఎల్లో మీడియా చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి లేని పాలన సాగిస్తున్న తమ ప్రభుత్వం గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల వల్ల పడిన ఇబ్బందులను, ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న సేవలను తెలియజేస్తామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందాలంటే మరోసారి జగనన్నే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, కౌన్సిలర్ సమ్మద్, నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, బుగ్గరపు నాగరాజు, నాగేంద్ర, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

ప్యాపిలి: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన పలు ఆధునీకరణ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. షాదీఖానా పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి నిర్వాహకులకు అప్పగించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపించకుండా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం గృహ ఆవరణలో పార్కును అభివృద్ధి చేయాలన్నారు. పార్కు విషయంలో గ్రామపంచాయతీ కూడా చొరవ తీసుకోవాలని సర్పంచ్ లక్ష్మిదేవి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డిని ఆదేశించారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు, వ్యాయామానికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఆర్టీసీ డీపీటీఓ శ్రీనివాసులు, డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఆర్అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ ఏఈలు ప్రభాకర్ రెడ్డి, రవి కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

- ప్యాపిలి–హైదరాబాదు, ప్యాపిలి–నంద్యాల బస్సు సర్వీసులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ప్యాపిలి నుంచి ప్రతి రోజు రాత్రి 8–15కు కూకట్‌పల్లికి బస్సు బయలుదేరుతుందన్నారు. ప్యాపిలి నుంచి నంద్యాలకు రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మంత్రి ఆర్టీసీ బస్టాండ్ నుంచి షాదీఖానా వరకు పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు. అంతకు ముందు మంత్రి ఎస్ రంగాపురం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలరంగయ్యను పరామర్శించారు.

### బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల పట్టణాల్లో టీడీపీ స్మగ్లింగ్ బ్యాచ్ కొత్త ప్రచారానికి తెరతీసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో డోన్‌లో టీడీపీ గెలిస్తే ప్రతి రేషన్‌కార్డుదారుడికి 1.5 సెంట్ స్థలం ఇస్తామని డమ్మీ బాండ్లు పంపిణీ చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్యాపిలి పట్టణంలోనే 7,000 రేషన్ కార్డులు ఉన్నాయని కోట్లాది రూపాయలు వెచ్చించి అన్ని ఎకరాలు చంద్రబాబు నాయుడు ఇస్తారా? సుబ్బారెడ్డి ఇస్తారా అనేది ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు.

- అభివృద్ధిని చూసి ఓర్వలేక నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న టీడీపీ నాయకులపై ప్రజలే చీపురు పట్టుకుని తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. డోన్, ప్యాపిలి మండలాల్లో నిరుపయోగంగా ఉన్న నంద్యాల నీటి పథకానికి రూ.10 కోట్లు వెచ్చించి ఉపయోగంలోకి తెచ్చి 17 గ్రామాల దాహార్తిని తీర్చామన్నారు. రూ.350 కోట్లతో చేపడుతున్న వాటర్ గ్రిడ్ పథకం ద్వారా మరో మూడు నెలల్లో నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాము వేసిన రోడ్లు తమలపాకు రోడ్లో, తారు రోడ్లో ప్రజలకు తెలుసన్నారు. ఆయన వెంట వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, డోన్ మార్కెట్ యార్డ చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఏపీబీసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాచేపల్లెలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అహోబిలం ప్రధానార్చకులు

## వైభవంగా అహోబిల దాస కార్యక్రమం

ఆళ్లగడ్డ: మండలంలోని బాచేపల్లె గ్రామంలో అహోబిల దాస కార్యక్రమాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. హిందూ ధర్మం, శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రచారంలో భాగంగా అహోబిలం మఠం 46వ పీఠాధిపతి పర్యవేక్షణలో అహోబిల దాస కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో ఉత్సవ మూర్తులు లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను కొలువుంచి పుణ్యాహవాచనం చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలతో సుదర్శన హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



బయటపడేందుకు చేరువలో సంగమేశ్వరాలయం

## సంగమేశ్వరాలయం కనువిందు

కొత్తపల్లి: మండల పరిధిలోని సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న దృశ్యం కనువిందు చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు కృష్ణా జలాల మధ్యలో ఓ ద్వీపాన్ని తలపిస్తూ.. నీటితో తేలియాడుతుందా అన్నట్లు ఉన్న సంగమేశ్వరాలయం, పక్కనే నల్లమల అటవీ అందాలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు. బుధవారం సంగమేశ్వరం వద్ద కృష్ణా (సప్తనదుల సంగమ)జలాల్లో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ సంగమేశ్వర ద్వీపం కార్యక్రమం నిర్వహించారు.

# నూతన ఆలయం.. ఆధ్యాత్మిక శోభితం

- గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో ఆలయాల నిర్మాణం
- టీటీడీ శ్రీవాణి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు 32 ఆలయాలు మంజూరు
- ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు
- స్థానిక గ్రామ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్మాణం



పెద్దకోట ఎస్సీ కాలనీలో పూర్తి కావచ్చిన శ్రీ రామాలయం



తెల్లపురిలో చివరి దశలో ఉన్న యాదగిరి నరసింహస్వామి ఆలయం

కర్నూలు కల్చరల్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మ ప్రచారం లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీవాణి ట్రస్టును ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నూతన ఆలయాల నిర్మాణం చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార వర్గాలకు చెంది వెనకబడిన ప్రాంతాల్లో వెంకటేశ్వర స్వామి ఆలయం/ రామాలయాల నిర్మాణాలు చేపట్టి భక్తుల చెంతే భగవంతుడు ఉండేలా ముందుకు సాగుతున్నారు. ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున ఉమ్మడి జిల్లాలో 32 దేవాలయాల నిర్మాణానికి రూ.3.20 కోట్లు నిధులను వెచ్చిస్తున్నారు. దేవదాయ శాఖ, సమరసత సేవా ఫౌండేషన్ల ఆధ్వర్యంలో దేవాలయాల నిర్మాణం జరుగుతోంది. మూడు విడతల్లో 32 ఆలయాలను గ్రామాల్లోని స్థానిక కమిటీలు నిర్మాణ బాధ్యతలను చేపట్టాయి. ఒక్కొక్క ఆలయాన్ని 10 సెంట్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. దేవతా మూర్తుల విగ్రహాలకు రూ. 2 లక్షలు, ఆలయ నిర్మాణానికి రూ.8 లక్షలు వెచ్చిస్తున్నారు.

**మండలాల వారీగా..**

మొదటి విడతలో దేవనకొండ మండలంలో 3, మిద్దూరులో 2, పాములపాడులో 1, చాగలమర్రిలో 3, బనగానపల్లెలో 5,అవుకులో1, నంద్యాలలో 1చొప్పున మొత్తం 16 ఆలయాలు నిర్మిస్తున్నారు. రెండో విడతలో గోస్పాడులో 2, కొలిమిగుండ్లలో 1 మొత్తం 3, మూడో విడతలో ఆళ్లగడ్డలో 1, రుద్రవరంలో 1,శిరివెళ్లలో 5, ఉయ్యాలవాడలో1,కొలిమిగుండ్లలో2,పాణ్యంలో 3 చొప్పున మొత్తం 13 ఆలయాలు నిర్మాణం కానున్నాయి. మూడువిడతల్లో 32 దేవాలయాలు నిర్మించనున్నారు.

### పనులు వేగంగా సాగుతున్నాయి



దేవదాయ శాఖ పరిధిలో మొదటి విడతలో 13, రెండో విడతలో 2 ఆలయాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్థానిక కమిటీలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయి. కొన్ని ఆలయాల నిర్మాణం పూర్తయ్యింది. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలోనే అన్ని ఆలయాలు భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీనివాస ప్రసాద్, డీఈఈ, దేవదాయ శాఖ

### నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తాం

మొదటి విడతలో ఒకటి, రెండో విడతలో 3, మూడో విడతలో 13 ఆలయాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొదటి, రెండో విడత ఆలయాల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఇటీవలే మూడో విడతలో ఆలయాలు మంజూరయ్యాయి. వీటికి స్థలాల గుర్తింపు, నిర్మాణ కమిటీలను ఎంపిక చేస్తున్నాం. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభం అవుతాయి. నిర్దేశించిన సమయంలోగా నిర్మాణాలను పూర్తి చేస్తాం.

– రామకృష్ణ, ఈఈ, శ్రీశైలం దేవస్థానం

## క్లుప్తంగా


### ప్రతి రైతుకు ఈ-క్రాప్ బుకింగ్ రసీదులు



మద్దికెర మండలంలో రైతులకు అందించిన రసీదులు

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ రసీదుల జారీకి వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. 10,17,374 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. అయితే 9,73,650 ఎకరాలకు సంబంధించి 3,25,851 మంది ఈ–కేవైసీ ద్వారా సాగు చేసిన పంటలను ధృవీకరించారు. ప్రతి రైతు మొబైల్ ఫోన్‌కు నమోదు చేసిన పంటలకు సంబంధించిన వివరాలను ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియపరుస్తున్నారు. పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని ధృవీకరిస్తూ ఈ–కేవైసీ పూర్తయ్యాక రైతులకు రసీదులు జారీ చేస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద నోటిఫై చేయబడిన పంటలకు ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి తద్వారా పంటల బీమా చేయబడిందని స్పష్టంగా పేర్కొనడం విశేషం.

### టపాసులు అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు



ఎస్పీ కృష్ణకాంత్


కర్నూలు: బాణ సంచా విక్రయదారులు నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్పీ జి.కృష్ణకాంత్ హెచ్చరించారు. దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. నీరు, ఇసుక, అగ్నిమాపక సామగ్రి టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్ 100కు సమాచారం అందించాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

### రిటైర్డ్ డీఆర్వో సూర్యప్రకాష్ మృతి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ఆర్‌డీఓ, డీఆర్వో, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీగా పనిచేసి పదవీ విరమణ పొందిన సూర్యప్రకాష్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన స్వస్థలం అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలోని ఉప్పునేసిపల్లె. పదవీ విరమణ తరువాత ఆయన అక్కడే నివాసం ఉంటున్నారు. అంత్యక్రియలు గురువారం సొంతూరులోనే నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### రోషన్‌అలీకి 'లైఫ్‌టైమ్' అవార్డు

- 11న విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేత



కర్నూలు (న్యూటౌన్): ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు కృషి చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్ సయ్యద్ రోషన్‌అలీ ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ అందజేస్తున్న లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనారిటీ విద్యార్థులకు విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన కోసం తాను కృషి చేసినట్లు చెప్పారు. కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు కోసం శ్రమించానన్నారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

### ఈ శ్రామ్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఈ శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు కార్మిక శాఖ సహాయాధికారి కేశన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులు సమీపంలోని సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికలు, రెవెన్యూ అంశాలపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 2, 3 తేదీల్లోపు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే మరోసారి పూర్తి చేయాలన్నారు. ముసాయిదా జాబితాలో వచ్చే క్లెయిమ్‌లు, అబ్జెక్షన్స్‌ను తప్పనిసరిగా పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఉంటే ఓటరు నమోదుకు దరఖాస్తు చేయించాలన్నారు. మీడియాలో ఎన్నికల జాబితాపై వస్తున్న ప్రతికూల వార్తలపై పరిశీలన చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఒక్కో లోకేషన్‌లో నాలుగు పోలింగ్ స్టేషన్లకు మించి ఉండకూడదన్నారు. గుర్తింపు పొందిన 6 రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా జాబితాలో జరుగుతున్న మార్పులు, చేర్పులను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో మధుసూదనరావు, ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి పాల్గొన్నారు.

## కరువు పరిశీలనకు త్వరలో జిల్లాకు కేంద్ర బృందం

- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి




సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో కరువును పరిశీలించేందుకు త్వరలో కేంద్ర బృందం వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం తన చాంబరులో టెక్నికల్ ఏవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో 24 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిందన్నారు. ఆయా ప్రాంతాల్లో కరువును ప్రతిబింబించే ఫొటోలు సేకరించాలని పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కింద ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపుతుందని తెలిపారు. కేంద్ర బృందం పరిశీలించేందుకు ఫొటో ఎగ్జిబిషన్‌కు తగిన ఫొటోలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సాంకేతిక ఏవోలు శారదమ్మ, అనురాధరెడ్డి, ఉషారాణి, రాఘవేంద్ర, అల్లీపీర తదితరులు పాల్గొన్నారు.




ఏనుగు శిల్పం



పాలరాతి మందిరం

## అపురూపం.. పాలరాతి మందిరం



ఆకర్షణీయంగా పైకప్పు

కర్నూలు తుంగభద్ర నది తీరాన్ని ఆనుకుని పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర పాలరాతి మందిరం కనువిందు చేస్తోంది. మహవీర్‌థామ్ జైన్ ట్రస్ట్ మండల్ ఆధ్వర్యంలో ఈ మందిరాన్ని సుమారు రెండు ఎకరాల్లో నిర్మించారు. 2004లో ప్రారంభమైన నిర్మాణం 2023 జనవరి 26తో పూర్తయ్యింది. నిర్మాణానికి రాజస్థాన్ రాష్ట్రం మకరాన ప్రాంతం నుంచి పాలరాతి శిల్పాలను తీసుకొచ్చారు. ఆర్చి, ఏనుగు శిల్పాలు, స్తంభాలు, పైకప్పు, గోడలు ఎంతో అపురూపంగా కనిపిస్తున్నాయి.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



మహావీర్‌థామ్ స్వామి మూలవిరాట్



## వివాహిత ఆత్మహత్య



రామేశ్వరి(ఫైల్)

కొత్తపల్లి: సంతానం కలగలేదనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కపిలేశ్వరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా మానపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన రామేశ్వరి(23), కపిలేశ్వరం గ్రామానికి చెందిన రామాంజనేయులు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో వైద్యులను సంప్రదించారు. అయినా ఫలితం లేకపోవడంతో మనోవేదనకు గురై రామేశ్వరి ఈనెల 6న ఇంట్లో పురుగు మందు తాగింది. భర్త గమనించి హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి జల్లాపురం వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు.



## కేసీ ఆయకట్టుకు ఊరట!

- మూడురోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు
- సుంకేసుల బ్యారేజీకి రానున్న వరదనీరు
- తీరనున్న తాగు, సాగు నీటి సమస్య

కర్నూలు (సిటీ): గత మూడు రోజులుగా సుంకేసుల డ్యాంకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వానలు కేసీ ఆయకట్టు రైతులకు ఊరటనిస్తున్నాయి. పంటలపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో గత పది రోజులుగా ఆయకట్టుకు సాగునీటి విడుదల నిలిచిపోయింది. దీంతో బ్యారేజీ నుంచి పడిదెంపాడు గ్రామం వరకు ఉన్న పంటపొలాలకు నీరందని పరిస్థితి. బ్యారేజీలో ఉన్న నీటిని కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా బ్యారేజీ నుంచి మునగాలపాడు వరకు కేసీ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మోటర్లను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. దీంతో పాటు జి.శింగవరం సబ్ స్టేషన్ నుంచి ఆ మోటర్లకు విద్యుత్ సరఫరాను సైతం నిలిపివేశారు. అయితే, దీనిపై నాలుగైదు రోజులుగా ప్రతిపక్ష పార్టీలు రైతులను రెచ్చగొడుతూ ఆందోళనలు చేసే ప్రయత్నం చేశారు. వర్షాభావ పరిస్థితులతోనే పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోతున్నామని మరోవైపు అధికారులు ఆయకట్టుదారులను నచ్చజెబుతున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న వేదవతి (హగరి) నది పరీవాహక ప్రాంతంలో మూడు రోజులుగా కురిసిన వర్షాల వల్ల 2 వేల నుంచి 3 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నదిలోకి చేరింది. దీనికి ఆర్‌డీఎస్ ఆనకట్ట ఎగువ భాగంలోని తుంగభద్ర నది పరీవాహక ప్రాంతంలో కురిసిన వాన నీరు కలిసింది. ఇలా మొత్తం 5 వేల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి ఆర్డీఎస్ ఆనకట్ట దగ్గర ఉన్నట్లు జలవనరుల శాఖ ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. సుంకేసుల బ్యారేజీకి రానున్న ఆ నీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు సాయంత్రం కేసీ కాలువకు వెయ్యి క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వస్తున్న నీటితో నది తీర గ్రామాలతో పాటు కర్నూలు నగరపాలక సంస్థ తాగునీటి అవసరాలు తీరనున్నాయి.

## ఈవీఎంల ప్రథమ స్థాయి పరిశీలన పూర్తి



బెల్ ఇంజినీర్లను సన్మానించిన కలెక్టర్ మనజీర్

నంద్యాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన పూర్తయిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంల భద్రత గోడౌన్లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) చివరి ఘట్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లకు సంబంధించి ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాన్ని బెల్ ఇంజినీర్లు, రెవెన్యూ, ఇతర సిబ్బంది నిర్వహించారన్నారు. ఇందులో పార్లమెంట్‌కు సంబంధించి 2030 కంట్రోల్ యూనిట్లు, 2509 బ్యాలెట్ యూనిట్లు, 2452 వీవీ ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 1,924 కంట్రోల్ యూనిట్లు, 2,520 బ్యాలెట్ యూనిట్లు, 2,451 వీవీ ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారన్నారు. గత నెల 16వ తేదీ ప్రారంభమైన ఈవీఎంల మొదటి దఫా పరిశీలన ఘట్టం బుధవారంతో ముగిసిందన్నారు. గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంల నిఘా నిమిత్తం సెక్యూరిటీ గార్డ్స్ కోసం నిర్మిస్తున్న షెల్టర్‌ను పరిశీలించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెక్ విజయవంతంగా పూర్తి చేసినందుకు 14 మంది బెల్ ఇంజినీర్లను, నోడల్ అధికారి, ఎఫ్ఎల్‌సీ సూపర్‌వైజర్ సుబ్బారెడ్డిని కలెక్టర్ సన్మానించారు.